
# సద్గురు
# శ్రీనాన్నగారు



# సద్గురు
# శ్రీ నాన్నగారు

*

డా. కె. రామారావు

పురాణ పురుషుల పాద స్పర్శతో పునీతమైన పుడమి తల్లి - పుణ్యపురుషుల కన్నతల్లి మన తల్లి భారతి. అట్టి భరతమాత గర్భాన పవిత్ర గోదావరి తీరాన, సాగర సంగమ సమీపాన 1934 సెప్టెంబరు 23 ఆదివారం నాడు నిండు పున్నమి రోజున పుణ్యదంపతులు జిన్నూరు గ్రామవాసులు సూర్యనారాయణరాజు, రాజయమ్మల ప్రథమ బిడ్డగా, వెంకట లక్ష్మి నరసింహరాజు నామధేయంతో ఆధ్యాత్మిక ఆకాశాన ఒక పూర్ణ చంద్రుడుఉదయించాడు.

పువ్వు పుట్టగానే పరిమళించి నట్లు - చిరు ప్రాయమునందే ఆధ్యాత్మిక చింతనతో ఆ బాలుడు దిన

దిన ప్రవర్థమానుడయ్యాడు - పుణ్య తీర్థాలు సందర్శించాడు - పునీతుల దీవెనలనందుకున్నాడు.

1957లో అరుణాచల ఋషిగా వినుతికెక్కిన భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆ బాలునికి స్వప్నములో దర్శనమిచ్చి; ఎత్తుకొని, హృదయానికి హత్తుకొని, ముద్దాడి ఆశీర్వదించారు. అంతే 1983లో ఆ మొగ్గ పువ్వుగా మారిపోయింది. గోదావరి ప్రాంత మంతా రమణ తత్వ పరిమళంతో గుప్పుమంది, ఆ గుభాళింపు దేశ విదేశాలు వ్యాప్తి చెందింది - వారే జిన్నూరు శ్రీ నాన్నగారు! భక్తులు కొలిచే పెన్నిధి - దీనుల పాలిటి కల్పతరువు.

కొందరు అంటూ వుంటారు - "ఆయన సద్గురువునని ప్రకటించు కున్నారా?" అని. వేరు భావన వున్నవాడు ప్రకటించుకుంటాడు. మరి ప్రకటించుకునే వాడే లోపల లేనప్పుడు ఎవరు ప్రకటించుకుంటారు - ఎవరికి ప్రకటించుకుంటారు? ప్రకటించుకునే వాడు అసలు గురువు శబ్ధానికి అర్హుడా? మంత్రం చెప్పినంత మాత్రాన, మహిమలు చేసినంత మాత్రాన ప్రతీ వాడు గురువు అవుతాడా? కాదు! ఆత్మ ద్రష్ఠ ఒక్కడే గురువు! చూపుచేతనో, మాటచేతనో, స్పర్శచేతనో, మనస్సును మార్చి హృదయములోనున్న ఆత్మ వైపునకు అంతర్ముఖ పరచగలవాడే గురువు శబానికి అరుడు.

మానవ మానసం ఎంత దూరమైతే పయనించి సత్యాన్ని మాటలలో చెప్పగలదో - ఆ స్థాయికి దిగివచ్చి ఆర్తులకు సత్యాన్ని విప్పిచెపుతూ, చేతికి పట్టి చూపుతూ, తన శాంతితో ఎందరి హృదయాలలోనో కాంతిని నింపుతూ, చూపులతోనే ఎందరి కన్నీళ్లనో తుడుస్తూ, అజ్ఞాన తిమిరంలో అలమటిస్తున్న అభాగ్యుల జీవితాలలో జ్ఞాన దీపాలను వెలిగిస్తూ, గృహస్తుగా జీవిస్తూ తన జీవితాన్నే ఒక సందేశముగా చూపిస్తూ - మాటతోనో, మౌనంతోనో, చూపుతోనో, స్పర్శ తోనో, తన్ను దర్శింప వచ్చిన వారిని హృదయపు లోతులలోనికి పయనింప జేస్తున్న పరమ పవిత్రుడు, జ్ఞాన స్వరూపుడు శ్రీ నాన్నగారు.

"మీ యింటికి వస్తే ఏమిస్తారు - మా యింటికి వస్తే ఏమి తెస్తారు"... ఇదీ నేటి సమాజ దుస్థితి!

ఇటువంటి రోజులలో - "నామాటలను సక్రమంగా అర్థం చేసుకోండి - అర్థం చేసుకోవటం కూడా ఒక యోగమే - అదే మీరు నన్ను గౌరవించటం! మీ దండల్ని గాని, దండాలను గాని, ధనాన్ని గాని నేను ఆశించుట లేదు. మీరు తిన్న అన్నం జీర్ణం చేసుకుంటే మీ వంటికి బలం - నా మాటల్ని అర్థం చేసుకుంటే మీ మనస్సుకు బలం. అవి మీ స్వరూపాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తాయి. నన్ను మీరు తెలుసుకుంటే మీరు సుఖపడరు - మిమ్మల్ని మీరు

తెలుసుకుంటే మీరు సుఖపడతారు" అని శ్రీ నాన్నగారిలా చెప్పే నిస్వార్థ గురువులు ఎందరుంటారు?

వేష భాషలతో సమాజాన్ని మోసపుచ్చి దోచుకొనే నేటి రోజులలో - "విషయం మీ బుద్ధికి అర్థమయ్యేలా చెప్పలేక పోతే - ఆ దోషం నాది గాని మీది కాదు. నాలో పవిత్రత వుంటే మీరు మరచిపోవాలనుకున్నా నా మాటలు మిమ్ములను వెన్నంటి తరుముతాయి. నేను స్మరించినంత మాత్రము చేతనే మీకు శాంతి కలుగక పోతే - నాలో శాంతి లేనట్లే, నాలో పవిత్రత లేనట్లే. నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మ వైపుకు తిరగకపోతే ఆ లోపం నాదిగాని మీదికాదు" అని శ్రీ

నాన్నగారిలా చెప్పే సాహసమున్న గురువులు ఎందరున్నారు?

ఇజాల పేరుతో, విప్లవాల పేరుతో సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న నేటి తరానికి ఆయన విసిరిన సవాల్ - "ఏది విప్లవం? కర్రలు పెట్టి కొట్టుకుంటే, కత్తులపెట్టి కుత్తుకలు కోసుకుంటే, తుపాకులుపెట్టి కాల్చుకుంటే, బాంబులు పెట్టి పేల్చుకుంటే, వీధులో లూటీలు చేస్తే - అది విప్లవమనో ఏదో అంటున్నారు. కాని అది విప్లవం కాదు. మీ మనస్సును మీరు సంస్కరించు కుంటే అదే నిజమైన విప్లవం! అంతకు మించిన విప్లవం లేనేలేదు" అని విప్లవానికే బాష్యం చెప్పారు శ్రీ నాన్న గారు.

గుడ్డలు మార్చుకొని అడవులకు వెళ్లమనో, అన్న పానాలు మానుకో మనో, సంసారాలను విడిచి పెట్టమనో శ్రీ నాన్నగారు బోధించుటలేదు! ఆత్మకోసం, సత్యంకోసం, స్వరూప సుఖాన్ని పొందటం కోసం - మన మనస్సుల్ని శుద్ధిగా వుంచుకోమని, మన స్నేహాలను శుద్ధిగా ఉంచుకోమని హితవైనదే మితముగా తినమని, మితనిద్ర, మితభాషణ అలవరచు కోమని మన మేలుకోరి, మనసుఖం కోరి చెపుతున్నారు శ్రీ నాన్నగారు.

వారు బోధించే అమృత వాక్కులు ఒక దేశానికో, మతానికో, కులానికో పరిమితం కాదు. "భగవంతుడు మనకు బుద్ధిని ప్రసాదించాడు - ఎందుకు?

ఆలోచించమని! మీ బుద్ధికి పదును పెట్టండి! మీ వివేకాన్ని పెంచుకోండి! మీ స్వరూపాన్ని సందర్శించండి! స్వరూపాన్ని సందర్శించని జన్మ వ్యర్థం! మనమందరం ఊహ తెలిసినది మొదలు "నేను నేను" అని అంటున్నాము. ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రించే వరకు ఈ "నేను" మనల్ని పిశాచంలా పట్టి పీడిస్తున్నది - దాని యిష్టం వచ్చినట్లు ఆడిస్తున్నది. కాని ఈ "నేను" ఎవరో మనకు తెలియదు. ఈ "నేను" ఎవరో, దాని మూలమేమిటో తెలిసేవరకు ఏ జీవుడికీ సుఖంలేదు, శాంతిలేదు, చావు పుట్టుకలు తప్పవు. మరి ఈ నేనుకు మూలం ఎక్కడ? ప్రతీ మనిషి "నేను చెపుతున్నాను, నేను చెపుతున్నాను"

అని గుండెల మీద కుడివైపునే చేయి వేసుకుంటాడు. అంటే ఆ నేనుకు మూలం అక్కడనే ఉంది. అదే ఆధ్యాత్మిక హృదయం - ఆత్మకు నిలయం! అనంతమైన, అఖండమైన, అద్వితీయమైన, అనిర్వచనీయమైన, అవ్యయమైన, అజరమైన, అభౌతిక మైన, ఆత్మగతమైన అసలు "నేను" అక్కడనే ఉంది. నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు ఈ ఆత్మగతమైన "నేను"లో నుంచే మనమంటున్న దేహ పరిమిత మైన "నేను" అను తొలి తలంపు పుడుతున్నది - అదే అహంకారము. ఈ "నేను" అను తొలితలంపునకే మిగిలిన ఎన్నో తలంపులు వచ్చుచున్నవి. ఆ తలంపుల మాటే మనస్సు! మనకు రాగం వచ్చినా, ద్వేషం వచ్చినా ,

కామం వచ్చినా, క్రోధం వచ్చినా, లోభం వచ్చినా, మోహం వచ్చినా అన్నీ ఈ పరిమిత "నేను" కే వస్తున్నాయి. గాఢనిద్రలో ఈ "నేను" లేదు. అప్పుడు ఈ గొడవలు ఏమీ లేవు -చివరకు దేహం లేదు, లోకం లేదు, దేవుడు కూడా లేడు. కాని మనము మాత్రం సుఖంగా ఉన్నము. సుఖముగా ఉన్నామేగాని సుఖముగా వున్న సంగతి నిద్రలో నుండగా తెలియుట లేదు. మేల్కొంచి మాత్రమే సుఖముగా ఉన్నామని చెప్పు తున్నాము. నిద్ర నుంచి మేల్కొంచగానే మరల "నేను" అను తలంపు పుడుతున్నది. దాని వెనుకాలే సైన్యం వచ్చినట్లు - మన గొడవలన్నీ గుర్తుకు వస్తున్నాయి - అశాంతిని తెస్తున్నాయి. మెలుకువలో

మనము ఉన్నామని తెలుస్తున్నది. కాని మనము మాత్రం సుఖంగా లేము. గాఢ నిద్రలో నున్న సుఖాన్ని మెలుకువలో నున్న ఎరుకను ఏక కాలంలో అనుభవంలోనికి తెచ్చుకోగలిగితే అదే మోక్షం! మనము మోక్షం కావాలని కోరుకుంటున్నాము. కాని మనము మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడా మనము మోక్షములోనే ఉన్నాము. అయితే అది మన అనుభవములోనికి రాకుండా మన పరిమితమై "నేనే" అడ్డు పడుతున్నది. మన అన్ని అనర్థాలకు మూలమైన ఈ "నేను ఎవరు?" అని మీరెప్పుడైనా ప్రశ్నించుకున్నారా? కనీసం ఈ రోజునుంచైనా ఈ "నేను ఎవరు?" అని విచారణ చేయండి! దాని అస్థిత్వాన్ని ప్రశ్నించండి! అప్పుడు ఈ

నేను దానికి వచ్చు తలంపుల నుంచి విడివడి, అంతర్ముఖైతన పుట్టుచోటును అన్వేషిస్తూ, హృదయము వైపు ప్రయాణముచేసి, తన పుట్టుచోటైన ఆత్మను చేరుకుంటుంది. "నేను ఎవడను?" అని విచారణ చేసి ఈ నేనును ఆత్మలో స్థిరముగా నిలిపి ఉంచగలిగితే తలంపుల వేగము తగ్గి మనస్సు పలుచబడుతుంది - పరిశుద్ధ మౌతుంద. పరిశుద్ధ మనస్సు ఆత్మాకారము చెందుతుంది. ఆత్మలో ఐక్యమయ్యే వరకూ ఏ జీవుడూ బంధములోనుంచి బయట పడలేడు. మీరు ఏ పని చేసినా హృదయ శుద్ధికోసమే చేయండి. "శుద్ధిలేని వాడికి సిద్ధికలుగదు." అని బోధిస్తున్నారు శ్రీ నాన్నగారు.

చివరిమాటగా శ్రీ నాన్నగారు చెప్పేది - "మీకు శక్తివుంటే సాధన చేసి తరించండి. సాధన చేసే ఓపిక లేకపోతే కనీసం ఒక సత్పురుషునితో సహవాసము చేయండి - సమస్త సద్గుణాలూ మీకు సమకూడతాయి. సంసార సాగరాన్ని దాటి పోతారు" అంటున్నారు.

అందుకోగలిగిన వారికి అడ్డదారి కూడా చెపుతున్నారు శ్రీ నాన్నగారు - "మనస్సును నిగ్రహించుకోవటాలు, సత్యాన్ని అన్వేషించటాలు నీకెందుకు? నీవు మనస్సు కాదు - ఆత్మవు! నీవు గాని మనస్సు గొడవ నీకెందుకు? దానిని పట్టించుకోకు! దానిని ఖాతరు చేయకు! నీవు నీవుగా [ఆత్మగా] ఉండు

- సరిపోతుంది - సాధనతో పనే లేదు" అంటున్నారు.

రియాలిటీని రియలైజ్ చేయుట కోసం ఎందరో మహాత్ములు ఎన్నెన్నో మార్గాలను చెప్పారు. మీకు నచ్చిన మార్గాన్ని మీరు ఎంచుకొని మీ పద్ధతిలో మీరు ప్రయాణము చేయండి - మీరెవరో మీరు తెలుసుకోండి - మీ జన్మలను జ్ఞానముతో పండించుకోండి - మీరు దుఃఖములో నుంచి బయట పడండి - మీరు శాంతిగా ఉండండి - మీ శాంతిని మీతోటి వారికి పంచిపెట్టండి!

☆ ☆ ☆

శ్రీ నాన్నగారి
షష్ఠిపూర్తి
సందర్భముగా...